క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేల విరాళం అందజేస్తున్న దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు, పెయింటింగ్ కోసం టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి రూ. 25 వేలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, విష్ణుదాస్, భీముడు, వెంకన్న, మునిస్వామి, రాజశేఖర్, వేణుగోపాల్, కిశోర్, విజయసారధి, రామక్రిష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెండి పడిగె వితరణ



వెండి పడిగెను అందిస్తున్న దాత

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి భక్తులు వెండి పడిగెను బహూకరించినట్లు ఈఓ రామకృష్ణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బనగానపల్లె పట్టణం జెక్క సుబ్రమణ్యం కుమారుడు డాక్టర్ అభిరామ్ తమ ఇలవేల్పు స్వామి వారికి 1030 గ్రాముల వెండి పడిగెను అందించినట్లు చెప్పారు. ఆలయ మర్యాదలతో దాతల కుటుంబసభ్యులచే స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రాలు అందించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): వివిధ కారణాలతో ఏర్పడే విద్యుత్ అంతరాయ సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శించరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సరఫరాలో అంతరాయ సమస్యలు రాకుండా తరచూ నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. వీటిపై సరైన దృష్టి పెట్టని పక్షంలో బ్రేక్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్, ఎగ్జిఫ్యూజ్ పాడవడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

28న భోగేశ్వరాలయం మూసివేత

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరాలయం ఈ నెల 28వ తేదీన రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మూసివేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి గురువారం తెలిపారు. 29వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆలయం మూసివేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ శుద్ధి సంప్రోక్షణ తర్వాత యథావిధిగా దర్శనాలు పునఃప్రారంభమవుతాయన్నారు.

ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధి వీకర్ సెక్షన్ కాలనీలో ఉన్న మార్గదర్శి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల నిబంధనలు పాటించని కారణంగా గుర్తింపును రద్దు చేసినట్లు మండల విద్యాధికారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీకర్ సెక్షన్ కాలనీ ప్రధానోపాధ్యాయుల వారికి స్వాధీనం చేసి వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్‌ను తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పించేటప్పుడు ప్రభుత్వ గుర్తింపు ఉన్నది లేనిది తెలుసుకోవాలని సూచించారు.

30న ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 30 వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ (సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో),లాన్ టెన్నిస్ (జొహరాపురం)లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.

సకాలంలో డోర్ డెలివరీ చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): సామగ్రి డోర్ డెలివరీని సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లా ప్రజా రవాణా శాఖ కర్నూలు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కేవీ రమణ అన్నారు. డోర్ డెలివరీ మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం స్థానిక కర్నూలు–1 డిపో గ్యారేజీ ముందు పార్సిల్స్ డోర్ డెలివరీపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్సిళ్లను సకాలంలో డోర్ డెలివరీ అందించి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు.

నిజం గెలిచినందుకే బాబు జైలుపాలు

- భువనేశ్వరి యాత్ర పేరును అబద్ధమే గెలవాలని మార్చుకోవాలి
- చంద్రబాబు ఏరోజూ పేదల సంక్షేమం కోసం పనిచేయలేదు
- పెత్తందారుల కోసమే ఆయన తాపత్రయం
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న చంద్రబాబునాయుడు ఏరోజూ పేదల గురించి ఆలోచన చేయలేదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పి.రుద్రవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ధనికులకు మాత్రమే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు చేరువ చేశారన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. గూడు లేని నిరుపేదలకు చంద్రబాబు హయాంలో సెంటు భూమి కూడా ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షలాది మందికి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి ఇంగ్లీషు మీడియం విద్యను అందిస్తుంటే టీడీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి రాజధానిగా పదేళ్లు హైదరాబాద్ ఉండాలని చెప్పినా చంద్రబాబు తనకు అనుకూలమైన వారి చేత, పెత్తందారులు, బినామీల చేత అమరావతి ప్రాంతంలో వేలాది ఎకరాల భూములను కొనుగోలు చేయించి అక్కడే రాజధాని ప్రకటించి, దోపిడీకి స్కెచ్ వేశారని ఆరోపించారు. దళితుల భూములు లాక్కొని తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీ కోసమే పార్టీ పెట్టారని ఎద్దేవా చేశారు.

భువనేశ్వరి యాత్ర పేరు మార్చుకోవాలి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికి చంద్రబాబు జైలుకి వెళ్లారని, నిప్పు అని చెప్పుకునే బాబు అవినీతి సొమ్ముతోనే పెద్దపెద్ద న్యాయవాదులను తన తరఫున వాదనలకు ఏర్పాటు చేసుకోవడం ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే సుధాకర్ స్పష్టం చేశారు. అన్ని ఆధారాలు ఉండబట్టే బాబు జైలుపాలయ్యారని ఆలస్యమైనా కూడా చివరికి నిజమే గెలిచిందన్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి చేపట్టిన యాత్ర పేరును 'అబద్ధమే గెలవాలి' అని మార్చుకోవాలన్నారు. పేదల కోసం బాబు ఏ రోజు పని చేయలేదని, పెత్తందారుల కోసమే ఆయన తపనంతా అని వివరించారు. నిత్యం పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగనన్నను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం శిబిరంలోని స్టాల్స్‌ను పరిశీలించారు. సర్పంచ్ మధుసూదన్, మండలాధ్యక్షుడు మహబూబ్ బాషా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు డి.వాసు, ఈఓఆర్‌డీ అనురాధ, డీటీ భాను, వీఆర్‌ఓ బాబు, గ్రామ నాయకులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌తో సానుభూతి టీడీపీ భ్రమే

కర్నూలు సిటీ: రాబోయే 2024 ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని, ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమంపై కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ప్రతి కార్యకర్త నాలుగు నెలలు సైనికుడిలా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. గత తెలుగుదేశం పాలన, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను వివరించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర చేపట్టిందన్నారు. వాస్తవానికి నిజం అనేది గెలిచింది కాబట్టే చంద్రబాబు అవినీతి కేసులో అరెస్ట్ అయ్యారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బాబు అరెస్ట్‌తో సానుభూతి రాదని, అది అంతా భ్రమనేనని స్పష్టం చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి, ఏఏ పథకాలు గతంలో ఎంత మందికి వచ్చేవి, ప్రస్తుతం ఎంత మందికి వస్తున్నాయనే విషయంపై డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూరల్ మండలాధ్యక్షుడు మహబూబ్ బాష, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కోడుమూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని పులకుర్తి గ్రామంలో సురక్ష హెల్త్ క్యాంపును సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సురక్ష కార్యక్రమం ద్వారా నాణ్యమైన వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శిబిరంలో సుమారు 350 మందికిపైగా ప్రజలు వైద్య చికిత్సలు పొందారు. తహసీల్దార్ జయన్న, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానుయేలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పి.రుద్రవరం వైద్య శిబిరంలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



పులకుర్తి హెల్త్ క్యాంపులో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



పులకుర్తి హెల్త్ క్యాంపులో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు

డీఈఓ తనిఖీలు



గొల్లలదొడ్డిలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

సి.బెళగల్: పాఠశాల ఆవరణలో ఎవరైనా బీడీ, సిగరెట్ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని డీఈఓ రంగారెడ్డి హెచ్చరించారు. సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి యూపీ స్కూల్ ఆవరణలో గ్రామానికి చెందిన వ్యక్తులు ఏర్పాటు చేసిన దుకాణంలో బీడీ, సిగరెట్ అమ్మకాలు చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు గురువారం డీఈఓ పాఠశాల పరిసరాలను, దుకాణాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు దుకాణదారుడు పాఠశాల ఆవరణం నుంచి దుకాణం తొలగించారు. అనంతరం డీఈఓ గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాలలోని పాఠశాలల పరిరక్షణపై టీచర్లకు స్థానికులు సహకరించాలని కోరారు. పాఠశాలలో ఆవరణలో బీడీ బంక్ ఫిర్యాదుపై ఆలస్యంగా స్పందించిన మండల విద్యాశాఖ అధికారులపై మండిపడ్డారు. అనంతరం పాఠశాల, స్థానిక గ్రామ సచివాలయం, పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కార్యాలయాలు, తరగతుల నిర్వహణపై సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉద్యోగులు, విద్యాశాఖ అధికారులు, టీచర్లు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ఇనగండ్లలో సోదాలు నిర్వహిస్తున్న సీఐ మన్సురుద్దీన్, పోలీసులు

సి.బెళగల్: గ్రామాలలో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం సి.బెళగల్ మండలంలోని ఇనగండ్ల గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ పీరయ్య సి.బెళగల్, గూడూరు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అలాగే గ్రామ వీధుల్లో పోలీసులతో కవాత్తు చేశారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కోడుమూరు సర్కిల్ పరిధిలోని తెలంగాణ సరిహద్దు గ్రామాలలో పోలీస్ నిఘా పెంచామని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు, తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, అనుమానిత సంఘటనలు ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ పీరయ్య అన్నారు.

పౌరులందరికీ ఓటు హక్కు



సి.బెళగల్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

సి.బెళగల్:18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆల్ పార్టీ నాయకులకు ఓటు హక్కు, ఓటరు జాబితా, సవరణలు, మార్పులపై అవాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఓటరు సౌకర్యవంతంగా ఓటు వేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాను పక్షపాతం లేకుండా రూపొందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 6 ఎన్నికల కేంద్రాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రజలకు సౌకర్యవంతంగా లేదని, మార్పు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్, రవికుమార్ అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ తులాభారం'



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ముత్తరాజు సుబ్బారావు రచించిన శ్రీకృష్ణ తులాభారం పద్య నాటక ప్రదర్శన ఆహూతులను అలరించింది. గురువారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ తులాభార నాటక ప్రదర్శనను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన గుమ్మళ్ల బలరామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా డాక్టర్ అవార్డును శనివారం అందుకోనున్న రంగస్థల నటుడు ఏ.కోటేశ్వరరావు, సత్యభామగా రాయలసీమ ముద్దుబిడ్డ ఆంధ్ర పద్యనాటక నాయకి జి.రత్నశ్రీ నటించారు. అనంతరం తులభార నాటకం నాయక, నాయికీలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జయం శేషయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, దస్తగిరి, మహ్మద్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరాలు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సచివాలయ ఆవరణలో నిర్వహించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో ప్రజలు హాజరై వైద్య చికిత్సలు పొందవచ్చన్నారు.

కల్లూరు:మండల పరిధిలోని కే.మార్కాపురం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. వైద్య శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, ఇద్ద రు స్పెషల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల, రసూళ్లపే ట గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీ ఓ దస్తగిరి గురువారం తెలిపారు. మండలస్థాయి అధికారులు తప్పకహాజరు కావాలన్నారు. ఉద యం 8 గంటలకు ప్రారంభించే కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్ని గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు.

అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో దుకాణాలు నానాటికి పెరిగిపోయి పాఠశాల గదుల వద్దకు చేరుకుంటున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన చేపట్టారు. గురువారం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎస్‌ఐ అశోక్‌లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, వెంకటాద్రి మాట్లాడుతూ.. నానాటికీ దుకాణాలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని, దీనిపై అర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రాత్రి వేళల్లో ఈ దుకాణాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చే విద్యార్థులు అపరిశుభ్రంగా ఉన్న మైదానం, వరండాతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు.



ఎస్.కొంతలపాడులో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన
- కొమరోలులో రైతు భరోసా కేంద్రం ప్రారంభం



కొమరోలులో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. హుసేనాపురం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చికిత్సలు పొందారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారన్నారు. అదే బాటలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేసి, ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఖరీదైన వైద్యం గ్రామాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ జబ్బులతో పాటు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని, ఓట్లకోసం మాటలు చెప్పి, మోసగించే పార్టీలకు స్వస్తి పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, వైద్యాధికారి అమరనాథ్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్ గౌడు,సర్పంచ మధుకేశన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల సౌలభ్యం కోసమే ఆర్‌బీకేలు

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామ స్థాయిలో వ్యవసాయ సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొమరోలు గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.17 లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలలో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బల్క్ మిల్క్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాడిగేదెల పెంపకంపై ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రుణసాయం అందిస్తుందని చెప్పారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, రసాయన మందులను అందజేస్తోందని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు రామచంద్రయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి పద్మలత, మండల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ప్రతి ఇంటికీ సంక్షేమం



కొర్రపోలూరులో సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొర్రపోలూరు, సోమాపురం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, రైతులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏఏ పథకం ద్వారా ఎంతమేర లబ్ధి పొందారని వివరించారు. కొందరు రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. సోమాపురంలో విద్యుత్ వైర్లు ఇంటిపై తక్కువ ఎత్తులో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పగా గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో వైర్లను మారుస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ మాలిక్‌బాషా, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఈలు మూర్తి, భాస్కర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి పోటెత్తిన ప్రజలు



బలపనూరులో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో గురువారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన శిబిరాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ ఎంపీపీ దేరెడ్డి ఆదిశేషారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మి, సర్పంచ్ మాధవి, సుమంత్ రెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 1048 మంది ఓపీలు తీసుకొని వైద్య చికిత్సలు పొందారు. అలాగే 199 మందికి రక్త పరీక్షలు, ఈసీజీలు పరీక్షలు చేశారు. 141 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. వైద్య శిబిరాన్ని నంద్యాల జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, శ్రీమంత్, ఏఓ చంద్రశేఖర్, డాక్టర్ సునీత, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



గడివేముల సచివాలయం-1 భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ సీఈ కృష్ణారెడ్డి

గడివేముల: ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ క్యాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం గడివేములలోని సచివాలయం, ఆర్బీకే నిర్మాణాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం నాడు–నేడు కింద విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు ప్రాంగణాలు శుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు హెచ్ఎంలు పర్యవేక్షించాలన్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డీపీఈఆర్‌ఓ రామ్మోహన్,డీఈఈలు రవీంద్రారెడ్డి, గంగాధర్, ఏఈ భాస్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్కిల్ టెస్ట్



అభ్యర్థులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు సిటీ: జిల్లాలోని భవిత కేంద్రాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సహిత విద్యా రిసోర్స్ పర్సన్ పోస్టులకు సంబంధించి స్కిల్ టెస్ట్ గురువారం పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఒక్కో పోస్ట్‌కు ముగ్గురు చొప్పున మెరిట్ ప్రాతిపదికన జాబితాను ఎంపిక చేశారు. అభ్యర్థులను స్కిల్ టెస్ట్ కమిటీలోని డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కర్నూలు, నంద్యాల డీఈఓలు డాక్టర్ వి.రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ ఇంటర్వ్యూ చేశారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకరావాలని కమిటీ సభ్యులు తెలిపారు. స్కిల్ టెస్ట్‌కు మొత్తం 42 మంది అభ్యర్థులు హాజరయ్యారు.